# ఆకలి

## జె. శ్యామల



రోడ్డు మీద అన్యమనస్కంగా నడుస్తున్నాను. ఏవేవో ఆలోచనలు చెదపురుగుల్లా మెదడును తినేస్తున్నాయి. ఈ ఆలోచనలకు ఒక అర్థం పర్థం వుండదు. పక్కనే కనిపించిన ముష్టివాడి గురించి కొంతసేపు, అంతలోనే రెండ్రోజుల్లో వచ్చే ఆదాయం, ఖర్చుగురించి మరికొంతసేపు ఎక్కడా నిలకడా, పొంతన వుండదు.

ఇంతలో కాలు ఎత్తి అడుగు వేయబోయే సరికి చెప్పు పుటుక్కున తెగింది. 'అరె! ఇప్పుడెలాగ! స్టాండర్డ్ కంపెనీవే కొనుక్కున్నా పట్టుమని నాలుగు నెలలు పని చెయ్యని చెప్పులు' మట్టా పరిశీలనగా చూశాను. నా కంటికేదో అనింది. హమ్మయ్య! జటిలమైన సమస్య తీరిపోయినట్లు ఎట్టార్చి తెగిన చెప్పుతోనే కాళ్ళీడుస్తూ అక్కడికి చేరుకున్నాను.

అదో రిడ్ క్యాప్‌షాప్, అప్పటికే ఓ అయిదుగురు వ్యక్తులు నిలబడి వున్నారు. చేసేది లేక నా చెప్పును కూడా ముందుకు తోసి అక్కడే నిలబడ్డాను. చెప్పులు కుట్టే అతను కంగారులేకుండా తన పని చేస్తున్నాడు.

పక్కనే ఓ ట్రాన్సిస్టర్. ఏవో హిందీ పాటలు వస్తున్నాయ్. దాంతో పాటే అతనూ హమ్ చేస్తున్నాడు. చుట్టూ రకరకాల తోళ్ళముక్కలు, ఓ గుండ్రటి రేకు పళ్ళెంలో సైజులవారీ మేకులు, పక్కనే ఫెవికాల్ డబ్బా, కిందుగా ఓ ఎక్స్పైర్డ్ బాక్స్‌లో నీళ్ళు, కొన్ని పాలిష్ డబ్బాలు, బ్రష్‌లు, ఆరేకు బడ్డీలోనే తయారు చేసిన చెప్పులు ఓ వైపు, మరో వైపు రెండు మూడు దేవుళ్ళ పటాలు తగిలించాడు. అందులో ఓ ఫొటో నన్నమితంగా ఆకర్షించింది. ఎవరో గొప్ప దైవభక్తుడు చెప్పులు కడుతున్న దృశ్యం అది. 'ఎవరబ్బా!' 'పోనీ అడుగుదామా! నవ్వుతారేమో!' సందేహం. 'ఎవరయితే నాకెందుకులే. తొందరగా వెళ్ళాలి. ఇంకెంత సేపో!'

అతను ఎవరినీ నొప్పించకుండా ఒక్కొక్క చెప్పు మీద ఓ క్షణం దృష్టి కేంద్రీకరిస్తున్నాడు. ఓ చెప్పు తీసుకొని పాడయిపోయిన మేరకు చెక్కేసి పక్కన పెట్టి మరో చెప్పుకు ఫెవికాల్ రాసి, ఓ పక్కన ఆరబెట్టి, ఇంకో చెప్పుకు నాలుగుమట్లు వేసి, మరో చెప్పుకు రెండు మేకులు దిగేస్తున్నాడు.

అతగాడు ఒక్కో చెప్పు పట్టుకున్నప్పుడల్లా ఆ చెప్పు తాలూకు వ్యక్తి మొహంలో ఆనందం. తన పని అయిపోతోందనే ఫీలింగ్. తీరా అది మళ్ళీ పక్కన పెట్టాక నిరుత్సాహం, నిస్సహాయత.

చివరికి అన్నీ అయినయ్. నా చెప్పునతను తీసుకోబోతున్నంతలో ఒకతను వెహికల్ మీద నుంచి దిగి వచ్చాడు. చెప్పులు కుట్టే అతను లోపలి జేబులోంచి కొన్ని నోట్లు తీసి లెక్కపెట్టి ఇచ్చాడు. అతను మళ్ళీ లెక్కబెట్టుకుని బుక్‌లోరాసి అతని చేత సంతకం పెట్టించుకుని వెళ్ళాడు. సేవింగ్స్ కాబోలు.

నా చెప్పు చకచకా కుట్టిచ్చాడు. అర్ధ రూపాయి బిళ్ళ యిచ్చి చెప్పులో కాలుదూర్చాను. అతను బాగు చెయ్యాల్సిన బూటేదో తీసుకుని పని మొదలెట్టాడు. నాకతన్ని చూస్తే ఈర్ష్య వేసింది. తన పనేమో, తనేమో, ప్రశాంతమైన జీవనం! అక్కడ్నుంచి మనిషిని కదిలానే కానీ ఆలోచనలు మాత్రం అతని చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.

ఆ రోజు నుంచి ఆ రోడ్డు మీద కెళ్ళినప్పుడల్లా కొంతసేపు ఆ పక్కనే నిలబడి అతణ్ణి పరిశీలించడం అలవాటయింది. అలా చూస్తున్నప్పుడు మనసులో చికాకంతా మాయమయ్యేది.

ఓ రోజు కావాలని కాస్త పాడయిన బూట్లుంటే కవర్‌లో వేసుకుని బయల్దేరాను. అతను వాటిని చూసి. "కొంచెం టైం పడుతుంది. రేపొచ్చి తీసుకుంటారా" అన్నాడు.

"పర్వాలేదు. అందరివీ అయ్యాకే కుట్టు" అంటూ ఆ పక్కనే వున్న పెద్దరాతి మీద సర్దుకుని కూచున్నాను.

రకరకాల మనుషులు, రకరకాల చెప్పులు. కాలంతో పాటు అతని చేతులు వేగంగా కదులుతున్నయ్. అందరూ వెళ్ళి పోయారు. అతడు నా బూట్లని చేతుల్లోకి తీసుకున్నాడు. "చానా ఆలీశమయిపోయింది సార్!" అని అతడంటుంటే బదులుగా చిన్నగా నవ్వాన్నేను.

ఇంతలో ఓ ముష్టివాడు వచ్చాడు. చెప్పులు కుట్టే అతను "దా! తాతా!" అంటూ ఆదరంగా ఆహ్వానించాడు. లోపల్నుంచి ఓ చెప్పుల జత తీసి "వేసుకుని చూడు" అంటూ వాటిని ముందుకు నెట్టాడు. ఆ ముసలి ముష్టివాడు చెప్పులు తీసుకుని వేసుకున్నాడు ఆనందంగా.

—"ఏది కాలం పాయె బిడ్డా వుంచు నాయనా నిజం చెప్పాలంటే కాలికి చెప్పులేసుకుని ఎన్నేళ్ళయిందో" అన్నాడు.

"చెప్పుల్దేముంది లే తాతా! చేతిలో పనేగా" అన్నాడు. ఆ ముష్టివాడు దండం పెట్టి వెళ్ళిపోయాడు.

నాకు ఆశ్చర్యం, ఒకలాంటి ఆనందం కలిగాయి. ఆ క్షణంలో విరిగిన చెప్పుల్నీ, బూట్లనీ సైతం భద్రంగా దాచి 'పావలాకైనా సరే!' అమ్మి సొమ్ము చేసుకునే సంఘటనలు గుర్తొచ్చినాయ్.

'నాగరికంగా పైకి కన్పించే మన ప్రవృత్తి ఎంత అనాగరికమైంది' అనుకున్నాను. ఆ క్షణంలో అతను హిమాలయమంత ఎత్తులో, ఎంతో సుందరంగా వున్నట్టు, నేను మరుగుజ్జులా పాతాళంలోకి దిగబడుతున్నట్టు నాలో ఫీలింగ్.

నిశ్శబ్దంగా లేచి నుంచుని ముందుకు కదలబోయాను.

"సార్! సార్! మీ బూట్లు రెడీ. ఇప్పుడే తీసుకెళ్ళొచ్చు" అతను గబాగబా, గట్టిగా అన్నాడు.

జేబులోంచి ఓ అయిదునోటు తీసి అతనికిచ్చి "ఈ బూట్లు కూడా ఎవరికైనా ఇచ్చెయ్" అన్నాను.

అతను నా వంక ఆశ్చర్యంగా, వింతగా, నమ్మలేనట్లుగా చూస్తుంటే అది నా ప్రవర్తనలోని అసహజతను ఎత్తి చూపిస్తున్నట్లుగా తోచింది. మనసులో ఇరుకుగా, ఇబ్బందిగా వుండి హడావుడిగా అడుగు ముందుకేశాను. అతని చూపుల్నుంచి తప్పించుకున్నాననుకున్నానే కాని ఆ చూపులు నన్నింకా వెంటాడుతూనే వున్నాయి.

---

**గాంధి పుట్టిన దేశం**

ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు వుండవు
ప్రభుత్వ రేషన్ షాపులో సరుకులు వుండవు
ప్రభుత్వ ఖజానాలో డబ్బులు వుండవు
ప్రభుత్వ సారాయి దుకాణంలో 'నో స్టాక్'
బోర్డులు వుండవు!

— ఏనుగు కిశోర్ బాబు

---

**అవినీతి**

రాజకీయ క్షురకులు
వాగ్దానాల మొండికత్తులతో గీసేకొద్దీ
వ్యవస్థా దేహానికి నిర్దర్గ్లా పెరిగే గడ్డం!!

—చల్లా రామఫణి